# మా వూరి సత్యం

రాగూరు బాలమురళీకృష్ణ

"సత్యం" పిలిచాను.

సత్యం తల పైకెత్తి "వాడు చచ్చాడు! కాదు...కాదు... నేను...నేనే చంపేశాను అన్నాడు!" సత్యం స్వరం గాద్గికంగా మారింది



"**మాట్లాడవేం** తాతా? వాడు... మా అమ్మనూ, నాన్ననూ **పొట్టన** పెట్టుకున్నాడు! ఆరోజు ఒక్కరంటే ఒక్కరూ పట్టించుకోలేదు. అదే విధంగా నీ కొడుకును చంపినపుడు కూడా గూడెం తలుపు ఒక్కటీ తెరుచుకోలేదని విన్నా! కాని ఈరోజు చివరికి నువ్వుకూడా ధైర్యంగా మళ్ళా చంపుదామన్న కోపంతో వచ్చావు... నాకు తెలుసు తాతా! అందరూ మిన్నకుండా కూర్చుంటే విశ్వం ఇంకా పెట్రేగిపోతాడు' అందుకే... కేవలం అందుకే చంపేశాను!" ఉద్రేకం, ఆవేశంతో సత్యం చెప్పిన మాటల్ని వింటున్నా...

వాడి శవాన్ని చూసేసరికి నా హృదయ కుతకుతా ఉడికిపోయింది  ఆ దృశ్యం చూసేసరికి ఒళ్ళు జలదరించింది. చంపడం అంటే ఏ కడుపులోనో, గుండెలోనో పొడిచి చంపడం కాదు! మొండెం నుంచి విసిరేసిన మేకపోతు తలలా అల్లంత దూరాన పడివుంది. విశ్వం తల కాళ్ళకు రెండడుగుల దూరంలో నుండే రక్తం వాసన గుప్పుమంటోంది వెనక్కి తిరిగివచ్చేశాను.

నా కన్న కొడుకు 'అమ్మా' అంటూ పిలిచిన ఆర్తనాదం ఇంకా నా చెవుల్లో గింగురు మంటోంది.

'పట్నం పోయి బదుకుతా నాన్నా' అన్నాడు కొడుకు.

నా కొచ్చిన నాలుగు అచ్చరం ముక్కలు గూడేనికి నేర్పమని పట్టుబట్టాను. ఫలితం చెట్టంత కొడుకును పోగొట్టుకున్నాను.

ఒకరోజు మా గూడెంకు ఒక మాస్టారిని రప్పించాడు విశ్వం. అదీ కేవలం అతడి కొడుక్కు చదువు చెప్పించాలన్న ఉద్దేశ్యంతో. కొడుకు లేడన్న బాధ దిగమ్రింగి మాస్టారి వద్దకెళ్ళాను... గూడెంకు విద్యాదానం చెయ్యమనీ.

"ఈ విషయం కామందు గార్ని అడిగితే బాగుంటుంది ఆయన కోరికమీదే కదా నేనీ ఊరు వచ్చింది" అన్నారు మాష్టారు.

మాష్టార్ని ఒప్పించడానికి ఎంతో ప్రయత్నించాను. చివరికి 'చూద్దాం' అని మాట దాటేశారు మాస్టారు.

\+ + +

దూరంగా మాస్టారు... మాస్టారి ప్రక్కన ఓ కుర్రాడు వస్తూ కనిపించారు. బహుశా కొడుకేమో! నూనూగు మీసాలతో 'హుందాగా అడుగులేస్తున్నాడు.

నా ప్రయత్నాన్ని మానుకోదలుచుకోలేదు. వాళ్ళని సమీపించి.

"ఏం మాస్టారూ, కులాసేనా?" అడిగాను పలకరింపుగా.

"అంతా కులాసే" అన్నారు మాస్టారు నవ్వుతూ.

"ఈ అబ్బాయి మీ అబ్బాయే అనుకుంటా!" అడిగాను.

"అవును. మా అబ్బాయే పేరు సత్యం! చదువు పూర్తి చేసుకుని వచ్చాడు!" నవ్వుతూ చెప్పాడు.

"మాస్టారూ, మీ అబ్బాయినింత చదివించారు. ఈ గూడెం వాళ్ళందరూ మీ బిడ్డలే అనుకుని వాళ్ళకు చదువునేర్పండి" అడిగాను ప్రాధేయపడ్తూ.

"నేనా... ఏ ఆధారంలేనివాణ్ణి ! మా బాబు లోకమంటే ఏమిటో తెలీనివాడు! నాకు చదువు చెప్పడం ఓ సమస్యకాదు..! వాళ్ళకు చదువు చెప్పడం. వాళ్ళు రేపు ఏదైనా..."

విషయం అర్థమైంది! వెంటనే గూడెం జనమందర్నీ పోగుచేసి, మాస్టారి వద్దకెళ్ళి.




"మాకు మీ సహకారం కావాలి. దానికి ఎంతమంది 'విశ్వం'లు అడ్డొచ్చినా మీకు అండగా నిలబడ్తాం" అంటూ హామీ ఇచ్చాం.

"కలెక్టరుకు ఉత్తరం ద్వారా మనకు కావలసిన సౌకర్యాలు తెలుపుదాం! ఆయన వాటిని పరిశీలించి తన సహాయం అందిస్తారు. అందులోనూ మన జిల్లా కలెక్టర్ తన స్నేహితుడి తండ్రే నంటున్నాడు. సత్యం! మీరందరూ మీమీ సంతకాలతో ఒక పిటీషన్ రాసివ్వండి" చెప్పారు మాస్టారు.

మర్నాడు ఆ పనిమీదే నేనూ, సత్యం, కొంత మంది గూడెం జనంతో పట్నం వెళ్ళాం! పని ముగించుకుని వెనక్కు తిరిగాం! బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్యాసింజరులోనే వెళ్ళిరావలసి వచ్చింది. ప్యాసింజరు దిగీదిగకముందే పక్కింటి వెంకయ్య కూతురు ఏడుస్తూ నన్నల్లుకుపోయింది!

ఆ ఏడుపు చూసి నామనసు ఏదో కీడు శంకించింది. ఏమైందని అడిగాను.

"మాస్టార్నీ అతని భార్యనూ విశ్వం చంపేశాడు" ఏడుస్తూ చెప్పింది.

కాళ్ళకింది భూమి కంపించినట్టయింది.

"ఎప్పుడు" మొద్దుబారిన మెదడు పనిచేయకున్నా అనుభవం నేర్పిన పాఠం వేయించిందా ప్రశ్న.

మేం బడికోసం పట్నం వెళ్ళామని తెలిసికొని గూడెం ప్రజల దగ్గర విశ్వం బాకీ వసూళ్ళు మొదలెట్టాడనీ, చెల్లించని వాళ్ళని తనకింద బానిసలుగా ఉండేలా బలవంతం చేశాడనీ, ఇది మంచిది కాదని ఎదురు తిరిగినందుకు మాస్టార్నీ, అతని భార్యనూ చంపేశాడనీ వెక్కిళ్ళ మధ్య చెప్పింది వెంకయ్య కూతురు.

అగమేఘాల మీద మృతదేహాల వద్దకు వెళ్ళేసరికి శవాల్ని తరలిస్తున్నారు పోలీసులు.

ఒక్కంగలో తాము పోలీసుల వద్దకు చేరుకుని "మీకు చేతులెత్తి మొక్కుతాను! కనీసం శవాన్నైనా— మిగల్చండి మాకు!" అంటూ చేతులు జోడించి ఆర్థించాడు సత్యం.

పోలీసులు మాత్రం 'మాకిది మామూలే' అన్నట్టు సత్యాన్ని పక్కకు నెట్టి వాళ్ళదారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

సత్యం మోకాళ్ళ మధ్య తల దాచుకుని ఏడుస్తూండిపోయాడు!

\+ + +

అందుకే ఈ రోజు సత్యం కామందుని చంపేశాడు. చేసింది హత్యే అయినా గూడెం ప్రజలకు మంచిపనే అయింది! విశ్వం చేసిన హత్యలకు ఏమీ చెయ్యని కోర్టు సత్యానికి మాత్రం పన్నెండేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించింది.

\+ + +

మరో పన్నెండేళ్ళ తరువాత...

నిజానికి ఈరోజు గూడేనికి పర్వదినం! అప్పుడే స్వాతంత్ర్యం వచ్చినంత సంతోషంగా ఉన్నారు. నేను పట్నానికి వెళ్ళడానికి బయల్దేరాను. నడుస్తూ ఉంటే డాక్టర్ సుబ్బారావు గారు ఎదురొచ్చారు.

"ఎక్కడికి?" అడిగాడు.

"సత్యాన్ని పిలుచుకు రావడానికి" చెప్పాను.

ఆ మాటలు వెనక నుండి విన్న కొత్త మాస్టారు రత్నం "సత్యం నిజంగా పుణ్యమూర్తి" అని ప్రశంసించాడు.

అప్రయత్నంగా రెండు కన్నీటి చుక్కలు నా కనులకొసల్లో నిలిచాయి.

\+ + +

జైలుగేటు దగ్గరకు వెళ్ళి "సత్యం విడుదలయ్యాడా?" అని అడిగాను.

"మాకేం తెలుస్తుందయ్యా! ఈ రోజింత వరకు ఎవరూ బయటకు పోలే! నువ్వలాకూర్చో! మీ సత్యం విడుదలైతే పిలుచుకుపోదువు." పక్కనున్న ఓ చెట్టును చూయించాడు.

నేను వెళ్ళి కూర్చున్నాను.

ఎక్కడి సత్యం ఎక్కడి నేను? ఎవరికి ఎవరు? చివరికి ఇద్దరి జీవితాలు గూడేనికే అంకితం అయ్యాయి! ఆలోచిస్తున్న నాకు గేటు చప్పుడు వినిపించింది.

గూర్ఖా నావైపే చూపిస్తూ ఎవర్తోనో ఏదో చెబుతున్నట్లనిపించింది! ఆ వచ్చేది సత్యమేనని దగ్గరైతే గానీ తెలుసుకో లేకపోయాను. "ఏం తాతా బాగున్నావా" అని ప్రశ్నించాడు.

ఏమని చెప్పాలి... ఇన్నేళ్ళు నాలుగు గోడల మధ్య ఉన్న అతను బాగున్నట్లో లేక ఈ విశాల ప్రపంచంలో ఉన్ననేను బాగున్నట్లో నా కర్థం కాలేదు.

కళ్ళు చెమ్మగిల్లాయి. పంచతో కళ్ళు తుడుచుకుని "బాగున్నాన్నాయనా" అన్నాను.

అతణ్ణి ఆ వేషంతోనే గూడేనికి పిలుచుకు పోవాలనిపించలేదు.

నెరిసిన గెడ్డాన్ని తీయించి, కాస్త చేయెంగిలి పడి ఇద్దరం బస్టాండుకు వచ్చాం.

ఇంకా ముప్పై నిమిషాల టైముందని పక్కవాళ్ళ నడిగితే చెప్పారు.

ముప్పై నిమిషాల తర్వాత బస్సు వచ్చింది ఎక్కి కూర్చున్నాం. పది నిమిషాల తర్వాత బస్సు కదిలింది.

"విశ్వం కొడుక్కి పెళ్ళయిందంట!" అన్నాడు సత్యం,

# తెలుగులో 'హమ్ ఆప్‌కే హై కౌన్'



ప్రముఖ హిందీ చిత్ర నిర్మాణ సంస్థ రాజశ్రీ ప్రొడక్షన్ అయిదేళ్ళ క్రితం నిర్మించిన 'మైనే ప్యార్ కియా' కలెక్షన్లలో రికార్డ్ సృష్టించింది. ఈ చిత్రాన్ని తెలుగులోకి 'ప్రేమ పావురాలు'గా అనువదిస్తే తెలుగులోనూ ఘన విజయం సాధించింది.

ఇప్పుడు రాజశ్రీ వారి తాజా సూపర్ డూపర్ హిట్ చిత్రం 'హమ్ ఆప్‌కే హై కౌన్' కూడా తెలుగులోకి 'ప్రేమాలయం' పేరుతో 'డబ్' కాబోతోంది.

80 ఏళ్ళ భారతీయ చలన చిత్ర చరిత్రలో 'హమ్ ఆప్‌కే హై కౌన్' అత్యధిక వసూళ్ళు సాధించిన చిత్రమైందిప్పుడు. వంద రోజులు అయిపోయినా ఇంకా హౌస్‌ఫుల్‌గా నడుస్తున్న ఈ చిత్రం 90 కోట్ల వరకూ వసూలుచేయొచ్చని సినీ పండితుల అంచనా.

**-మౌర్య.**

తగ్గు స్వరంతో.

"ఒక కూతురు కూడా" చెప్పాను నేను.

మాటలు మందకొడిగా సాగుతున్నాయి. ఇంతలో గూడెం వచ్చేసింది!

గూడెం వాళ్ళందరూ అక్కడే కనిపించారు. అందరి కళ్ళల్లో పన్నెండేళ్ళ తర్వాత సత్యాన్ని చూడాలన్న ఆతృత స్పష్టంగా కనపడుతోంది!

ఎదురుగా ముగ్గురు వ్యక్తులు కన్పించారు.

"వాళ్ళే విశ్వం కొడుకూ, కోడలూ, మనవరాలు" అన్నాను.

సత్యం చూశాడు కాని అతనిలో ఎలాంటి భావం కనబడలేదు.

ఇద్దరం బస్సు దిగాం, బస్సు వెళ్ళిపోయింది, బస్సు దిగగానే అందరూ మా చుట్టు ముట్టారు. వాళ్ళు చూపించిన ఆత్మీయతకు కళ్ళలో నీళ్ళు నిండాయి. ఇంతలో ఆ గుంపులోంచి మాకేసి వస్తూ విశ్వం మనవరాలు కన్పించింది.

ఆ అమ్మాయి దగ్గరౌతోంటే ఏదో తెలియని భయం! భయం కన్నా ఈ విషయం సత్యం ఎలా తీసుకుంటాడా అన్న ఆసక్తి ఎక్కువైంది నాకు.

విశ్వం మనవరాలు చేతిలోని పుష్పగుచ్ఛాన్ని సత్యానికి అందించింది. సత్యం దాన్ని అందుకుని ఆ అమ్మాయినెత్తుకున్నాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు.

ఆ అమ్మాయి "విశ్వనందిని" అంది.

ఆ తర్వాత "నీపేరేనా సత్యం" అడిగింది.

అవునన్నట్లు తలూపాడు సత్యం.

"అయితే మా తాతయ్యను ఎందుకు చంపావ్?" ప్రశ్నించింది.

అందుకు సమాధానంగా పక్కనున్న ఒక గూడెం అమ్మాయిని ఇంకో చేతిలోకి తీసుకుని.

"ఈ అమ్మాయి కూడా నీలాగా ఆడుకోవాలి, చదువుకోవాలి, మంచి గౌను వేసుకోవాలి అవునా కాదా?" అంటూ ఆ అమ్మాయికే ఆ ప్రశ్నను వదిలేశాడు.

"మరి... మరి... మా తాత వద్దన్నాడా?" చిన్ని బుర్రలోని తొలి సందేహాన్ని వ్యక్తం చేసింది.

గూడెం జనాన్ని చూపిస్తూ "అందుకేగా వీళ్ళందరూ ఇన్ని రోజులూ నీలా చదువుకోకుండా, మంచి గౌను వేసుకోకుండా, ఎండలో.. పొలాల్లో పనిచేస్తున్నారు!" చెప్పాడు సత్యం.

"పొలం పని చేసే వారికి చదువురాదా?" మళ్ళీ తన ధర్మసందేహాన్ని సత్యంకు తెలిపింది.

సత్యం అవునన్నాడు.

"నాన్న కూడా పొలానికి వెళ్ళాడు కదా! మరి నాన్నకు కూడా చదువు రాదా?" అంది సత్యం చెప్పేది నమ్మలేనట్లుగా.

"మీ నాన్నకు అన్నీవొచ్చు! అందుకేగా తాను మంచి బట్టలు వేసుకుని, నీకూ మంచి బట్టలు కొనిచ్చాడు" చెప్పాడు సత్యం సౌమ్యంగా.

"మరి వీళ్ళందరూ మంచి బట్టలు ఎప్పుడు వేసుకుంటారు?" అని తన చిన్ని చిన్ని చేతుల్తో గూడెం జనంకేసి చూపిస్తూ అడిగింది.

ఇంకా చేతిలో ఇబ్బందిగా కదుల్తోన్న అమ్మాయిని కిందికి దింపి.

"నువ్వూ నేనూ ఇద్దరం కలిసి వీళ్ళందరికీ మంచి బట్టలు వేసుకోవడం, చదువుకోవడం... నీలా ఆడుకోవడం నేర్పుదాం! సరేనా!" అన్నాడు సత్యం.

పాప ఇంకా ఏవేవో అడుగుతూంటే ఓపిగ్గా సమాధానమిస్తున్నాడు సత్యం.

ఆ పాప కిందకు దిగి సత్యం వేలుపట్టుకుని తన తల్లిదండ్రుల వైపు నడుస్తోంది స్థిరంగా!

నాకెందుకో ఆ దృశ్యం నా హృదయాన్ని పదిలించింది.★

